చిరంజీవి కనబడ్డాడు నాకు. ఈమధ్య చిరంజీవిని చూస్తుంటే నాకు ఒళ్లంతా మండిపోతోంది. దానికి కారణం - బహుశా నాతో ఆ విషయంలో పందెం కట్టడమే అనుకొంటాను !

ఔను, ఆ విషయమే — చిరంజీవి ముఖం బల్బులా వెలిగిపోతోంది. ఒకసారి ముఖం మాడ్చుకొన్నాను ఆ తర్వాత మనసులో భావాలు పైకి కనబడనీయకుండా నెమ్మదిగా పెదవుల మీదకు చిన్నని చిరునవ్వు బలవంతంగా తెచ్చుకొన్నాను తెచ్చుకొని, అన్నాను — "హలో !"

"గెలిచాను బాబ్జీ — నీ పదిరూపాయలూ ఊష్ కాకీ !" అన్నాడు చిరంజీవి గర్వంగా

నాకు అంతా అర్ధమయింది — చిరంజీవి ఎంతకైనా సమర్థుడు. వీడు గెలిచి వుండగలడు, ఆ విషయంలో సందేహం లేదు. అయినా మళ్లీ అడిగాను — కల్యాణి ఒప్పుకొందా ?"

నవ్వాడు చిరంజీవి. ఆ నవ్వులో విషంతో బాటుగా గర్వమూ వుంది.

"కల్యాణే కాదు, కల్యాణి బాబుకూడా ఒప్పుకొంటాడు — నేను ఆరోజే చెప్పాను..."

నిజమే, చిరంజీవి ఆరోజే చెప్పాడు — కానీ ఆ చెప్పటంలో తేడా వుంది. ఆరోజు 'యిలా జరగొచ్చురా !' అనేది ఉంటే, ఈ రోజున 'అలాగే జరిగింది చూశావా ?' అన్న గర్వం వుంది.

ఇంకేమీ మాట్లాడక పదిరూపాయల నోటు— ఇష్టం లేకపోయినాసరే, — తీసి చిరంజీవికి అందించాను.

# రంగుమార్చిన బొమ్మ



పాలకోడేటి సత్యనారాయణరావు

* * *

"ఏమిటోనండీ, మన జీవితం మన చేతుల్లోనే ఉందని అనుకొంటాంగానీ అదంతా నాన్సెన్స్ !" కల్యాణి అంది ఆవేశంగా.

నాకు నవ్వొచ్చింది —"ఇంతకీ ఏం జరిగింది?"

"ఏముందీ, మామూలే !" అంది కల్యాణి మామూలుగా.

కల్యాణికి కష్టమొచ్చేటంతగా ఏమీ జరిగి ఉండదు ! - కల్యాణి నాకు దాదాపుగా అయిదారేళ్లుగా తెలుసు. కల్యాణితో నాకు పరిచయం తమాషాగా అయింది. ఆ రోజున నా నాటకం రిహార్సలు వేస్తున్నారు చిరంజీవి వాళ్లు చిరంజీవి నన్ను నాటకం రిహార్సల్‌కు రమ్మని కోరాడు. ఏదో నాటకాలు రాసేయటమేగానీ నేను సాధారణంగా నాటకం రిహార్సల్‌కు వెళ్లను — కానీ ఆ రోజు చిరంజీవి నాటకంలో కొన్ని మార్పులు చేయాలి, రమ్మంటే తప్పనిసరిగా వెళ్లాను. ఆ రోజున పరిచయం అయింది నాకు కల్యాణి

ఇంతకీ నా నాటకంలో కథానాయిక పాత్ర కల్యాణిది కాదు.

కథానాయిక పాత్రధారిణి చెల్లెలు కల్యాణి — "నీరజక్క నాటకంలో వేషం వేస్తోందండీ, అక్కకు తోడుగా..."

నాకు అర్థమయిపోయింది — అక్కకు తోడుగా చెల్లెల్ని పంపించారు ! నవ్వుకొన్నాను నేను.

నాటకం ఒక పక్కన రిహార్సలు జరుగుతూనే ఉంది. అక్కడ అందరూ నాటకం రిహార్సల్‌లో ఉంటే, నేనూ కల్యాణీ ఇద్దరమే ఖాళీగా ఉన్నాము. ఖాళీగా ఉండి ఏం చేయాలో తెలీలేదు గనుక నెమ్మదిగా మాటల్లో దింపాను కల్యాణిని.

కల్యాణి ఇంకా చదువుకొంటోందిట ! — ఇంకా చదివితీరుతుందిట !

నేను నవ్వుతూ అడిగాను — "చదివాక ఏం చేస్తారు ?"

"ఇంకా చదవాల్సి ఉందండీ బోల్డు — ..."

"అదే, ఆ ఇంకా ఏదో చదివాక...?"

"చదివి... చదివి..." కల్యాణికి ఏమీ తోచలేదు గాబోలు — "అలా చదువుతూనే ఉంటాను !" అంది.

"అలా చదివి ... చదివి ... పిల్లల కోడిగా మారిపోవటమేగా మీ లక్ష్యం ?" అన్నాను నేను.

కల్యాణి మొదట నవ్వేసింది — తర్వాత నెమ్మ

దిగా అంది — "బహుశా నేను పెళ్లి చేసుకోను!"

"అదేం ?"

"నాకు పెద్దదాన్నవాలని వుంది !"

'పెద్దవారయాక పెళ్లి !"

"అలాకాదు. నా ఊహ ఏమిటంటే నేను చాలా గొప్పదాన్ని కావాలి !"

"అంటే మీ అక్కయ్యగారిలాగా గొప్ప నటి కావాలనా ?" అనడిగాను.

కల్యాణి నవ్వింది—"మా అక్కయ్య గొప్ప నటే, కాదనను ! మా అక్కయ్య స్టేజీ మీద కనబడితే చాలు ఎగబడి చూసేవాళ్లున్నారు. నా కదీ తెలుసు! కానీ మా అక్కయ్య జీవితం నాకు మార్గదర్శకం కాదు !"

"ఏం ?" అనడిగాను నేను.

"ఎందుకంటే, నాకు మా అక్కయ్య అంటే గొప్పదని తెలుసు. కానీ ఆ జీవితమే నాకు నచ్చనిది !"

"అంటే ..?"

"అంటేనా ? — ఆ నాటకాలే నాకు నచ్చనిది!"

"అదేమిటండీ — మీ అక్కయ్యగారు కళా సేవ చేస్తోంటే... !"

"కళా సేవా, నా బొందా ? నాటకాలలో కళేమిటండీ బాబూ ! కళా అది ? ఉహూ, కాదు బురద ! ఆ కళా బురదలో ఇరుక్కుంటే ఊబిలో దిగిపోయినట్లే ! —"

నాకు ఆశ్చర్యం కలిగింది — అడిగేశాను — "అదేమిటండీ, అంత దారుణంగా మాట్లాడు తున్నారు ?"

"దారుణం ఏముంది ఇందులో ? — అదిగో అలా చూడండి, ఆ రిహార్సల్స్ ! — వాళ్లు నటిస్తున్నారో లేదో నాకు అనుమానమే — 'నువ్వు నా ప్రాణం రాణీ !' 'నువ్వు లేని నా జీవితం వృథా !' 'నీకోసం ఏం చేయమంటావ్ నన్ను !' 'రాణీ, నిన్ను నా హృదయానికి హత్తుకొని ఏదో చేయాలని వుంటుంది !—' ఏం చేయాలని వుంటుంది, వాడి ముఖం ! — వెధవ డైలాగులూ వాడూనూ !"

"ఆ డైలాగులన్నీ రాసింది నేనే !"

"డైలాగు రాసిందానికి అనను నేను ! ఎటొచ్చీ ఆ నటన ! కంపరం పుడులోంది బాబూ, వీళ్లను చూస్తోంటే — వాళ్లూ, వాళ్ల చూపులూ అన్నీ అక్కయ్యమీదనే, ఇంకా నాటక మేమిటి నా బొంద! ముఖానికి కాదండీ రంగులు, మనసుకు రంగులు !"

క్షణం ఆగి అడిగాను — "మీ కింత ఎలర్జీగా ఉంటే మరి నాటకం రిహార్సల్స్‌కు వచ్చారేం ? —"

"ఏం చేయను, ఖర్మ ! మన జీవితం మన చేతుల్లోనే ఉందనుకొంటాంగానీ, అంతా నాన్సెన్స్ ! అక్కయ్యకు తోడుగా ఇటు రావాల్సి వచ్చింది నేను ! ఇంతకన్నా ఏముంది జీవితం — అక్కయ్యకు కాపలాగా..."

నాకు ఆశ్చర్యం కలిగింది — కల్యాణి ఎంత సిన్సియర్‌గా మాట్లాడుతోంది ! మనసులోది ఇంత స్పష్టంగాచెబుతోంటే నాకెందుకో భయంగాఉంది.

ఆడది మనసు విప్పి చెబుతోంటే, భయం కరంగా ఉంటుంది కాబోలు !

— ఈ సంగతే ఇంటికి వచ్చాక చిరంజీవితో చెప్పాను. చిరంజీవి నవ్వాడు.

"ఆ కల్యాణి అలా అంటుందేగానీ ఉట్టి దొంగరా !" అన్నాడు చిరంజీవి.

"అంటే ?"

"అంటే, అవకాశం ఇవ్వాలేగానీ కల్యాణి నటించదనా నీ ఊహ ?—"

"ఛీ, ఆ అమ్మాయికి నాటకాలంటే ఎంత అసహ్యమో నీకు తెలీదు !"

"ఏడిశావ్ — ఆ అమ్మాయిచేత నేనే వేయిస్తా చూడు ఆ అమ్మాయిచేత నాటకం —"

"నీవల్ల కాదు —"

"పందెం, పది రూపాయలు" అన్నాడు చిరంజీవి. కల్యాణిమీద నమ్మకంతో పందెం ఒప్పుకొన్నాను నేను.

* * *

చిరంజీవి, 'కల్యాణి ఒప్పుకొంద'న్న సంగతి చెప్పేసరికి నాకు మతిపోయింది. రూం లోంచి బయటకు నడిచాను నడుస్తోంటే కల్యాణి కనబడింది నవ్వుతూ— 'అమ్మయ్య ! బతికించారు !"

"ఏం జరిగింది ?" అన్నాను కొంచెం కఠినంగా.

నవ్వింది - "ఇంకా ఏం జరగాలి. జరగాల్సి వుంది ! ఇరవై రెండునగవీంద్రభాగనిలో నాటకంవుంది.."


"నాటకమా ?.." "మీరు నటిస్తారా.."

"ఔనండీ — నాటకమే ... తెలుగు చెప్పండి ? తెలుగు నాటకరంగం నన్ను రెండు చేతులా ఆహ్వానిస్తోంటే ఏం చేయను ? పైగా, ఏదో నాకు తోచిన సేవ నేనూ ఈ కళామతల్లికి చేద్దామని..."

నాకు నవ్వొచ్చింది — "నాటకరంగం అంటే బురద అని..."

"అన్నాననుకోండి. అదంతా చిన్నతనం ! తెలిసీ తెలియక ఏదో అన్నాను. — అయినా మీరు తప్పకుండా రావాలి నా నాటకానికి ! ఇదిగో మీకు ఆహ్వానం—" అంటూ అందించింది కల్యాణి.

అందుకొని కవరు విప్పాను. ఆహ్వానం మీద




రంగు రంగుల్లో కల్యాణి బొమ్మ వుంది — నాకు నవ్వొచ్చింది - కల్యాణి రంగు మార్చింది ! ఇంత క్రితం కల్యాణి బొమ్మ తెల్లగా, స్పష్టంగా, నిర్మలంగా వుండేది—ఇన్నిరంగులు పూసుకొందన్న సంగతి నాకు ఇప్పుడే తెలిసింది. నేను ఆశ్చర్యపోయాను !

* * *

ఒకటి, రెండు సంవత్సరాల తర్వాత..

రోడ్డు పక్కన వాల్‌పోస్టర్ మీద ఏదో చిత్రం గురించి ప్రకటన వుంది. యథాలాపంగా చూసిన నేను ఆశ్చర్యపోయాను — కల్యాణి ! — చిత్రరంగంలో... !

అక్క ముఖం మీద రంగులు పూసుకొంది.

కల్యాణి మనసుకు కూడ రంగులు పూసుకొందన్న సంగతి నాకు, ఇదివరకే తెలుసు—అందుకే నేనేం ఆశ్చర్యపోలేదు. పైగా —

'బహుశా కల్యాణిని చిత్ర రంగం రెండు చేతులా రమ్మని ఆహ్వానించి ఉంటుంది. ఏం చేస్తుంది పాపం ! ఏదో తనకు తోచిన సేవ ఆ కళామతల్లికి చేద్దామని...' అనికూడా అనుకొన్నాను.

## * పంజాబీ చోళే *

కావలసిన వస్తువులు : శనగలు, బఠాణీలు పావు కిలో, ఉల్లిపాయలు 2, కొత్తిమీర 1 కట్ట, పొదీనా ఆకులు కొన్ని, పచ్చి మిర్చి 6, బంగాళా దుంపలు 2, టొమాటో పండు 1, చింతపండు గుజ్జు, ఉప్పు, నూనె, పోపు సామాన్లు తగినన్ని.

తయారుచేయు విధానము : చోళే చేసుకొనే రోజు ముందు రాత్రి శనగలు, బఠాణీలు నీళ్లలో నానవేసి ఉంచుకోవాలి. మరునాడు నానిన బఠాణీలు, శనగలు బాగా కడిగి కొంచెం నీరుపోసి ఉడికించాలి. అవి ఉడికేలోపున ఉల్లిపాయలు, కొద్దిగా కొత్తిమీర, పొదీనా, పచ్చి మిర్చి యివన్నీ మెత్తగా నూరి ఈ ముద్దను ఒక పళ్లెంలో పెట్టుకోవాలి బంగాళా దుంపలు చెక్కుతీసి సన్నగా తరిగి యివికూడా వుడికించాలి. కొన్ని పచ్చిమిర్చి ముక్కలు, తరిగిన కొత్తిమీర, బంగాళాదుంప ముక్కలు, టొమాటో ముక్కలు ఒక పళ్లెంలో ఇవన్నీ పెట్టుకోవాలి. ఇవన్నీ చేసుకొనేసరికి బఠాణీలు, శనగలు ఉడికి ఉంటాయి. ఇవి నీళ్లలోనుంచి తీసి, బాణలిలో కొంచెం నూనె వేసి పోపు సామాన్లు మినపప్పు,శనగపప్పు,ఆవాలు, ఎండు మిర్చి ఒక కాయ తుంచివేసి యివి వేగాక నూరి ఉంచిన మసాలా ముద్ద వేసి గరిటెతో కలిపి బఠాణీలు, శనగలు వేసి, ఉప్పు, చింతపండు గుజ్జు వేసి, కలిపి మూత పెట్టాలి. బాగా ఉడికి దగ్గర పడ్డాక, ఒక స్టీలు పళ్లెంలోకి తీసుకొని అన్నీ వేపులా సరిసమానంగా పళ్లెంలో సర్ది, దానిపై ముందు రెడీగా ఉంచుకొన్న టొమాటో ముక్కలు, సన్నని కొత్తిమీర, బంగాళాదుంప ముక్కలు, పచ్చి మిర్చి యివన్నీ వేసి అలంకరించాలి. చూడటానికి ఎంతో అందంగా, తినటానికి రుచిగా ఉంటుంది. రొట్టెలు, పరోటాలు, చపాతీలు వీటిలో కూడ "పంజాబీ చోళే" ఉపయోగించుకోవచ్చును. దీనినే కొందరు "రగడా" అంటారు.

— కొచ్చర్లకోట పల్లిశ్రీ.